

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 149 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 30, ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5


పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# ఉన్నత శిఖరాగ్రుడు.. శివధర్‌రెడ్డి !



మహోన్నత విలువలతో పదవి విరమణ పొందారు

పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు

అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు

సౌమ్యామైన గుణానికి సారధి ఉన్నత భావాలకు ఊహకందని మేధావి

పోలీస్ శాఖలో ప్రత్యేకమైన ప్రస్థానాన్ని సంపాదించుకున్నారు

జీవిత సాఫల్యం అంటే చక్కటి ఉదాహరణ శివధర్ రెడ్డి ఐపీఎస్

పేద ప్రజల మనసుకు దగ్గరగా సేవలు అందించారు

అన్ని వర్గాల ఉన్నతాధికారులచే మెప్పు పొందారు

చిరస్థాయిగా నిలిచిపోయే నిర్ణయాలను అమలుపరిచారు

పేద ప్రజలకు పెద్ద ఎత్తున సేవలందించారు

డాక్టర్ బరిగెల శివ







డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ఉన్నత ఆశయాలను చేరుకోవాలంటే అసాధ్యమైనవన్నీ సాధ్యం చేసుకోవాలని డాక్టర్ బరిగెల శివ అన్నారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారిగా తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ తన బాధ్యతలను తన సమర్ధతను తన కర్తవ్యాన్ని తన సేవలను తెలంగాణ రాష్ట్రంలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ముద్ర వేసుకున్నారని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో కొత్త ఒరవడిని సృష్టించారని గర్వపడ్డారు.తనకు అత్యంత ఇష్టమైన పోలీస్ అధికారులలో డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ ఒకరని ఎంతో గర్వంగా చెప్పగలనన్నారు.ప్రస్తుత కాలంలో ఏ శాఖలోని ప్రభుత్వ ఉన్నత అధికారులైన ప్రజల మన్ననలను పొందుకోవడం

- మిగతా 2లో..

## తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1,000 కోట్ల బకాయిలు విడుదల

2025 అక్టోబర్ వరకు ఉన్న పెండింగ్ బకాయిలు క్లియర్ చేసిన ప్రభుత్వం

నిధులు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ

భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం

2






## అసోంలో బీజేపీ హవా, పుదుచ్చేరిలో ఎన్డీయే గెలుపు: ఎగ్జిట్ పోల్ సర్వేలు

126 స్థానాలకు బీజేపీకి 80కి పైగా సీట్లు వస్తాయన్న సర్వేలు

కాంగ్రెస్ కూటమి 30 లోపు సీట్లకే పరిమితమవుతుందన్న సర్వేలు

పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి గెలుస్తుందన్న ఎగ్జిట్ పోల్స్



| | | Seat Share | | Vote Share (%) Margin of Error ± 2% | |
|---|---|---|---|---|---|
| Alliance | Party | Party | Alliance | Party (%) | Alliance (%) |
| NDA | BJP | 70 - 80 | 88 - 100 | 37% | 48% |
| | AGP | 7 - 9 | | 7% | |
| | BPF | 9 - 11 | | 4% | |
| CONG+ | CONG | 22 - 30 | 24 - 36 | 31% | 38% |
| | Raijor Dal | 1 - 4 | | 3% | |
| | AJP | 1 - 2 | | 3% | |
| | CPI(M) | 0 - 1 | | 1% | |
| | IND (APHLC) | 0 - 2 | | | |
| ers | Others | 0 - 3 | 0 - 3 | 14% | 14% |

2

## ‘ధురంధర్’ తర్వాత రణ్‌వీర్ ? కొత్త ప్రాజెక్ట్ ఇదే... పుకార్లకు చెక్!

2

## డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్: సీఎం చంద్రబాబు

ఆర్టీజీఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

టెక్నాలజీ వినియోగంపై దిశానిర్దేశం

కర్నూలు డ్రోన్ సిటీ తొలి దశ పనులను జూలై నాటికి పూర్తి చేయాలని ఆదేశం

ప్రైవేట్ సీసీ కెమెరాల డేటాను కూడా ప్రభుత్వ వ్యవస్థతో అనుసంధానించాలని సూచన

శాటిలైట్ సమాచారాన్ని ఆర్టీజీఎస్‌కు అనుసంధానించి

వేగంగా స్పందించేలా చర్యలు



2

## ఎన్డీటీవీ ఎగ్జిట్ పోల్స్ సంచలనం..

● విజయ్ టీవీకే పార్టీకి 120 సీట్లు ● టీవీకేకు 120 సీట్ల వరకు ఛాన్స్ ● డీఎంకే కూటమికి ఎన్డీటీవీ ఎగ్జిట్ పోల్స్ షాక్ ● కింగ్ మేకర్‌గా మారనున్న నటుడు విజయ్ ● సోమవారం వెలువడనున్న తుది ఫలితాలు

**తమిళనాడు, జై భీమ్ న్యూస్**



హోరాహోరీగా సాగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ‘డీఎంకే’ పార్టీనే మళ్లీ అధికారంలోకి రానున్నట్లు మెజారిటీ ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. కానీ, ఎన్డీటీవీ-యాక్సిస్ మై ఇండియా సర్వే మాత్రం రాష్ట్రంలో పెను సంచలనం నమోదు కాబోతున్నట్లు వెల్లడించింది. ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన ‘తమిళ వెట్రి కళగం’ (టీవీకే) తన తొలి ఎన్నికల సమయంలోనే అధికార డీఎంకే కూటమికి గట్టి పోటీనిస్తూ కింగ్‌మేకర్‌గా అవతరించనున్నట్లు తెలిపింది. ఎన్డీటీవీ-యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ ఫలితాల ప్రకారం.. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే 98 నుంచి 120 స్థానాలను కైవసం చేసుకోనుంది. డీఎంకే కూటమి 92-110, ఏఐఏడీఎంకే కూటమి 22-32 సీట్లు దక్కించుకుంటాయని అంచనా వేసింది. ఇదే నిజమైతే దశాబ్దాలుగా సాగుతున్న డీఎంకే, ఏఐఏడీఎంకే రాజకీయాలకు తెరపడి కొత్త శకం మొదలవుతుంది. కనిష్ఠంగా 98 సీట్లు గెలుచుకున్నా విజయ్ పార్టీ కింగ్ మేకర్‌గా లేదా ప్రధాన శక్తిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. సోమవారం తుది ఫలితాలు వెలువడనున్నాయి.

**ఇతర సర్వేల అంచనాలు..**

పీపుల్స్ పల్స్: డీఎంకే కూటమికి 125-145, ఏఐఏడీఎంకేకు 65-80 సీట్లు. ప్రజా పోల్: డీఎంకే కూటమికి 148-168 స్థానాలు వస్తాయని, టీవీకే కేవలం 1-9 సీట్లకే పరిమితం అవుతుందని పేర్కొంది. కామాఖ్య అనలిటిక్స్: డీఎంకే (78-95), ఏఐఏడీఎంకే (68-84) సీట్లతో పాటు విజయ్ పార్టీకి 67-81 సీట్లు వస్తాయని అంచనా వేసింది. జేవీసీ: ఈ సంస్థ మాత్రం ఏఐఏడీఎంకే కూటమికి అత్యధికంగా 128-147 సీట్లు వస్తాయని భిన్నమైన ఫలితాన్ని ఇచ్చింది.

# డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్: సీఎం చంద్రబాబు

**ఆర్టీజీఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష**
**టెక్నాలజీ వినియోగంపై దిశానిర్దేశం**
**కర్నూలు డ్రోన్ సిటీ తొలి దశ పనులను జులై నాటికి పూర్తి చేయాలని ఆదేశం**
**ప్రైవేట్ సీసీ కెమెరాల డేటాను కూడా ప్రభుత్వ వ్యవస్థతో అనుసంధానించాలని సూచన**
**శాటిలైట్ సమాచారాన్ని ఆర్టీజీఎస్‌కు అనుసంధానించి వేగంగా స్పందించేలా చర్యలు**



**విజయవాడ, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలు అందించే ప్రతీ సేవను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకువస్తే, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం నాడు అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) పనితీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నాలజీని ప్రభుత్వ పాలనలో విరివిగా వినియోగించుకోవడంపై పలు కీలక నిర్దేశాలు చేశారు. ప్రస్తుతం 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,035 సేవలను అందిస్తున్నామని, ఈ విధానం ప్రారంభమైన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 54 లక్షల మంది పౌరులు 1.78 కోట్ల సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 24 లక్షల మందికి పైగా వాట్సాప్ ద్వారా సేవలు ఎలా పొందాలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ పురోగతిని అభినందించిన ముఖ్యమంత్రి, మిగిలిన అన్ని సేవలను కూడా నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్ వేదికపైకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**శరవేగంగా డ్రోన్ సిటీ.. జూలైకి తొలి దశ పూర్తి చేయాలి**

కర్నూలు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డ్రోన్ సిటీ మొదటి దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఇప్పటికే డ్రోన్ సిటీ మాస్టర్ ప్లాన్ ఖరారైందని, ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన 8 కంపెనీలకు భూముల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మే నెల రెండో వారంలో ఈ కంపెనీలు తమ నిర్మాణ పనులను ప్రారంభించనున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, డ్రోన్ సిటీ మొదటి దశ పనులను ఈ ఏడాది జూలై నాటికి కచ్చితంగా పూర్తి చేయాలని గడువు విధించారు. ఇది రాష్ట్రానికి టెక్నాలజీ రంగంలో గర్వకారణంగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

**నేర నియంత్రణ, శాటిలైట్ డేటా వినియోగంపై దృష్టి**

రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోందని అధికారులు తెలిపారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పర్యవేక్షణ అత్యుత్తమంగా ఉందని, దీని ఫలితంగా నేరాలను నియంత్రించడం, నేరస్తులను గుర్తించడం, మిస్సింగ్ కేసులు, వాహనాల దొంగతనాల వంటివి వేగంగా పరిష్కారం అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ కెమెరాలతో పాటు, సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు ఏర్పాటు చేసుకున్న కెమెరాల డేటాను కూడా ప్రభుత్వ వ్యవస్థతో ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా, శాటిలైట్ డేటాను ఆర్టీజీఎస్‌కు అనుసంధానించి, విపత్తులు లేదా అత్యవసర పరిస్థితులను ముందుగానే పసిగట్టి, వేగంగా స్పందించేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఇటీవల శేషాచల అడవుల్లో జరిగిన అగ్నిప్రమాదాన్ని ప్రస్తావిస్తూ, శాటిలైట్ సమాచారం ఉండి ఉంటే మరింత వేగంగా స్పందించే అవకాశం ఉండేదన్నారు. అలాగే, ఇటీవల తలెత్తిన ఇంధన సరఫరా సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించిందని, అయితే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకముందే రియల్ టైమ్‌లో గుర్తించి, నివారించే దిశగా సాంకేతికతను వాడుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1,000 కోట్ల బకాయిలు విడుదల

**2025 అక్టోబర్ వరకు ఉన్న పెండింగ్ బకాయిలు క్లియర్ చేసిన ప్రభుత్వం**
**నిధులు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ**
**భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. వారి బకాయిల కోసం వెయ్యి కోట్ల రూపాయలను విడుదల చేసింది. గత సంవత్సరం అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను క్లియర్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యంపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.1000 కోట్ల నిధులను విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల, జీపీఎఫ్ బకాయిలను ప్రభుత్వం పూర్తిగా క్లియర్ చేసింది. 2025 అక్టోబర్ వరకు ఉన్న అన్ని బకాయిలను ఒకేసారి విడుదల చేసింది. ఈ బకాయిల విడుదలతో పాటు భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి నెలా చేసే చెల్లింపుల పరిమితిని మరో రూ.1,000 కోట్లకు పెంచుతూ ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. దీనితో ఉద్యోగులకు సంబంధించిన క్లెయిమ్స్, బిల్లులు ఇకపై పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే వీలుంటుంది.



# ఉన్నత శిఖరాగ్రుడు శివధర్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి



ఎంతో కష్టమవుతుండగా ప్రజల కోసం సేవలందించి తన అధికార సేవా విలువలు ఎంత గొప్పగా ఉంటాయో చేసి నిరూపించడమే కాకుండా ఇతర శాఖల ఉన్నతాధికారులకు ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ సేవలను తెలంగాణ రాష్ట్రమంతా కొనియాడుతుందని పేర్కొన్నారు.అవకాశవాదాలను స్వార్థపూరిత అధికార పదవిని ఏమాత్రం దరిదాపుల్లోనికి రానివ్వకుండా అధికార పదవి అంటే పేద ప్రజలకు ఎంతలా ఉపయోగపడాలో చేసి నిరూపించిన డిజిపి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి పోలీస్ ఉన్నతాధికారుల క్రమసంఖ్యల సేవా ఆధారాలను పరిశీలిస్తుండగా శివధర్ రెడ్డి ఐపీఎస్ మహనీయుల జాబితాలో చేరిపోయారని గర్వంగా చెప్పగలమన్నారు. పేద ప్రజలను చూస్తేనే అసహ్యించుకుంటున్న నేటి దినాల్లో పేద ప్రజల తరపున నిలబడాలనే గొప్ప సాంకేతాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చాటిచెప్పిన తన సేవా భావాన్ని ప్రజలే కాకుండా పక్క రాష్ట్రాల ఉన్నత అధికారులు కూడా ఆదర్శంగా తీసుకుంటుండడం శివధర్ రెడ్డి సేవలో అంతటి నిజాయితీ దాగి ఉందని చెప్పగలమన్నారు.తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాన్ని అనుకున్న విధంగా పటిష్ట పరచడమే కాకుండా అనుకూలమైన వర్గం ప్రతికూలమైన వర్గం అనే భేదాభిప్రాయం లేకుండా ఉన్నది ఉన్నట్టుగా నిజాన్ని నిర్భయంగా ప్రభుత్వానికి చేరవేయడంలో తనదైన శైలి ముద్రను వేసుకోగలిగినారని చెప్పగలమన్నారు. పేద ప్రజలకు ఎలాంటి మేలు చేస్తే చిరస్థాయిగా నిలిచిపోతుందో సొంత ప్రణాళికను వేసుకొని సుదీర్ఘంగా ఆలోచన చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీస్ అధికారులు పేద ప్రజల ఇండ్లలోనికి వెళ్లి సమస్యలను తెలుసుకొని ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు వచ్చిన ప్రజల వద్దకే వెళ్లి ప్రజల వద్ద నుండి వినతి పత్రాలు తీసుకొని స్వయంగా వాళ్ళ బాధలు తెలుసుకొని వాళ్ళ తీసుకొని కేసులు కట్టే అటువంటి గొప్ప నిర్ణయాన్ని అమలుపరిచిన విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే కాదు భారతదేశంలో ఎక్కడ చూసి ఉండలేమన్నారు.ఒకవైపు స్టేషన్లలోనికి వస్తున్న పేద ప్రజలను పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదనే భావనకు పూర్తి విరుద్ధంగా స్టేషన్లలోనికి పేద ప్రజలు రావలసిన పనిలేదు పోలీసులే పేదవాళ్ల వద్దకు వచ్చి వాళ్ళ బాధలు తీరుస్తారు అనే అద్భుతమైనటువంటి నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుపరిచిన మహోన్నత అధికారిగా శిఖరాగ్రమైన నిర్ణయాన్ని అమలుపరిచి దాని ఫలితాన్ని రాష్ట్ర ప్రజలకు అందించారని తెలిపారు.అన్ని సమయాల్లో అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ పేద వర్గాలు బహుజన వర్గాలకు మాత్రం అత్యున్నత న్యాయం చేయగలిగిన పోలీస్ ఉన్నతాధికారులలో రాష్ట్ర డిజిపి లలో ప్రస్తుతం పదవి విరమణ పొందిన శివధర్ రెడ్డి ఐపీఎస్ ప్రథమ స్థానంలో ఉంటారన్నది మాత్రం జగమెరిగిన సత్యమన్నారు.తెలంగాణ రాష్ట్రంలో మత కల్లోలాలను కట్టడి చేసిన మొనగానిగా చరిత్ర సృష్టించారన్నారు.పక్క రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మతపరమైన విధ్వంసాలను పూర్తిగా నియంత్రించ గలిగారని తెలిపారు.సైబర్ క్రైమ్ నేరాలను పెద్ద ఎత్తున అరికట్టగలిగారని హైదరాబాద్ ప్రాంతంలో విస్తృతమైన కేసులను చేదించారని గుర్తు చేశారు.ఎక్కువ కాలం ఇంటలిజెన్స్ వ్యవస్థలో పనిచేయడం వల్ల రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్వల్పకాలంలోనే పోలీసు వ్యవస్థలో అనుకున్న స్థాయిలో మార్పులు చేపట్టారనేది బలంగా విశ్వసించాల్సిన అవసరం ఉందన్నారు.పోలీస్ అధికారుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తూ సమాచారాన్ని సేకరిస్తూ పేద ప్రజలకు సేవలు చేయబడే విధంగా ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు.పోలీస్ శాఖలో కొత్త రకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టడంలో తన ప్రత్యేకతను చాటుకున్నారని చెప్పాలన్నారు.సైబర్ క్రైమ్స్ లాంటివి నేరాలలో డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు ఎక్కువ శాతం న్యాయం చేస్తూ తిరిగి డబ్బులు ఇప్పించే విధంగా శాఖా పరమైన పటిష్టతను సేవలను చేసి నిరూపించారన్నారు.న్యాయస్థానాలలో పోలీస్ శాఖ పరంగా జరుగుతున్న కేసులు తుది ట్రాయల్స్ సమయాల్లో డీజీపీ స్థాయి అధికారిగా ప్రతి కేసుపై ప్రత్యేకమైన పర్యవేక్షణ చేయడం వల్ల న్యాయస్థానాల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా కేసుల శాతాన్ని పెంచారని దాని పేదలైన బాధితులకు అనుకున్న స్థాయిలో న్యాయం చేయగలిగారని వివరించారు.ఆపరేషన్ కగార్ పేరు మీద దేశవ్యాప్తంగా నక్సలైట్స్ పై ఎన్కౌంటర్స్ జరుగుతుండగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం దానికి పూర్తి భిన్నంగా భారత రాజ్యాంగం కల్పించిన హక్కులలో భాగంగా ప్రజలు జీవించి తీరాలి అనే బలమైన సూక్తిని బలపరచడం కోసం నక్సలైట్స్ ను జనజీవన స్రవంతిలో కలిసిపోయే విధంగా ఎక్కువ మోతాదులో నక్సల్స్ జీవితాలకు రక్షణ కల్పిస్తామంటూ బలమైన సాంకేతాన్ని పంపించడం వల్ల తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని నక్సలైట్స్ తెలంగాణ ప్రభుత్వం ముందు లొంగిపోయే విధంగా క్రియాశీలక పాత్ర పోషించిన పోలీసు ఉన్నతాధికారిగా గుర్తింపు పొందాలని దానివల్ల తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టు దళపతి గణపతితో సహా మరో ఇద్దరు ముగ్గురు ప్రధాన నక్సల్స్ నాయకులు మినహాయిస్తే తెలంగాణ రాష్ట్రాన్ని నక్సలైట్ రహిత తెలంగాణగా రూపాంతరం చెందే విధంగా క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు.దొంగతనాలను నేరాలను నియంత్రించడంలో ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు.మహిళా రక్షణ విషయంలో కొత్త రకమైన శాఖా పరమైన విధానాలను అమల్లోకి తీసుకువచ్చారని వాటి ప్రభావాన్ని నేడు తెలంగాణ రాష్ట్ర మహిళలు అనుభవిస్తున్నారని తెలిపారు.వాటివల్ల మహిళా రక్షణకు ప్రత్యేకమైన చట్టాలను అమలుపరిచి తీరాలని పేర్కొన్నారు.అన్నిటికి మించి భారత రాజ్యాంగానికి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తూ పోలీస్ శాఖ పరమైన సేవలో రాజ్యాంగపరమైన విధానాలను అనుసరిస్తూ అవలంబిస్తూ అమలుపరుస్తూ తనకు తానే సాటి తనకు ఎవరూ లేరు పోటీ అనేది నిరూపించుకోగలిగారని తద్వారా తెలంగాణ రాష్ట్రంలో సౌమ్యమైన గుణవంతునిగా అసాధారణమైన పరిజ్ఞానవంతునిగా రాష్ట్ర డిజిపి స్థానానికి మహోన్నతమైన సేవలను అందించిన ఉన్నత అధికారిగా తెలంగాణ రాష్ట్ర మాజీ డిజిపి శివధర్ రెడ్డి పోలీస్ చరిత్రకు సుపరిచితమైన నిర్వచనాన్ని మిగిల్చారని అలాంటి మహోన్నతమైన ఉన్నత అధికారి సేవలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవి విరమణతో సరిపెట్టకుండా రాష్ట్ర ప్రజలకు మరింత సేవలు అందించబడే విధంగా తన సేవలను మరోచోట అధికారికంగా ఉపయోగించుకోవాలని కోరారు.పేద ప్రజలకు ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని అతి కొద్ది మంది ఉన్నతాధికారులలో శివధర్ రెడ్డి ఐపీఎస్ లాంటి అధికారులు ప్రభుత్వానికి సహకారంగా ఉంటే ఇటు ప్రభుత్వానికి గాని అటు పేద ప్రజలకు గాని అనుకున్న స్థాయి కన్నా ఎక్కువగా మేలు జరుగుతుందని దాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో గుర్తించి గమనించి తన సేవలను మరోచోట ఉపయోగించుకోగలరని ఆశిస్తున్నామన్నారు.మాజీ డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ తన జీవితాంతం ఆయురారోగ్యాలతో,శాంతి సమాధానాలతో,సుఖ సంతోషాలతో నిరంతరం పేద ప్రజలకు తన వ్యక్తిగత సేవలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.

# అసోంలో బీజేపీ హవా, పుదుచ్చేరిలో ఎన్డీయే గెలుపు: ఎగ్జిట్ పోల్ సర్వేలు

**126 స్థానాలకు బీజేపీకి 80కి పైగా సీట్లు వస్తాయన్న సర్వేలు**
**కాంగ్రెస్ కూటమి 30 లోపు సీట్లకే పరిమితమవుతుందన్న సర్వేలు**
**పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి గెలుస్తుందన్న ఎగ్జిట్ పోల్స్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. పశ్చిమ బెంగాల్‌లో ఈరోజు రెండో దశ పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వచ్చాయి. అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అసోంలో 126 స్థానాలకు గాను బీజేపీ కూటమి 80కి పైగా సీట్లు గెలుచుకుంటుందని వివిధ సర్వేలు అంచనా వేస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ 22 నుంచి 30 సీట్లకే పరిమితం కానుంది. ఇతరులు 1 నుంచి 10 సీట్లు గెలుచుకుంటాయని అంచనా వేశాయి. 30 అసెంబ్లీ స్థానాలు ఉన్న పుదుచ్చేరిలోనూ ఎన్డీయే మెజార్టీకి కావాల్సిన సీట్లు గెలుచుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. బీజేపీ, మిత్రపక్షాలు 16 సీట్లకు పైగా గెలుచుకుంటాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

**అసోం ఎగ్జిట్ పోల్స్**

యాక్సిస్ మై ఇండియా : బీజేపీ 88 - 100, కాంగ్రెస్ 24 - 26 సీట్లు
పీపుల్స్ పల్స్: బీజేపీ 68 - 72, కాంగ్రెస్ 22 - 26 సీట్లు
పీ-మార్క్: బీజేపీ 82 - 94, కాంగ్రెస్ 30 - 40 సీట్లు
మాట్రిజ్ : బీజేపీ 85 - 96, కాంగ్రెస్ 25 - 32 సీట్లు
పీపుల్స్ ఇన్‌సైట్ : బీజేపీ 88 - 96, కాంగ్రెస్ 30 - 34 సీట్లు
జేవీసీ ఎగ్జిట్ పోల్: బీజేపీ 88 - 101, కాంగ్రెస్ 23 - 33 సీట్లు

**పుదుచ్చేరి ఎగ్జిట్ పోల్స్**

పీపుల్స్ పల్స్ : ఎన్డీయే 16 - 19, కాంగ్రెస్ 10 - 12 సీట్లు
చాణక్య స్ట్రాటజీస్ : ఎన్డీయే 17 - 20, కాంగ్రెస్ 9 - 13 సీట్లు
యాక్సిస్ మై ఇండియా : ఎన్డీయే 16 - 20, కాంగ్రెస్ 6 - 8 సీట్లు

| | | Seat Share | | Vote Share (%) Margin of Error ± 2% | |
|---|---|---|---|---|---|
| Alliance | Party | Party | Alliance | Party (%) | Alliance (%) |
| NDA | BJP | 70 - 80 | 88 - 100 | 37% | 48% |
| | AGP | 7 - 9 | | 7% | |
| | BPF | 9 - 11 | | 4% | |
| CONG+ | CONG | 22 - 30 | 24 - 36 | 31% | 38% |
| | Raijor Dal | 1 - 4 | | 3% | |
| | AJP | 1 - 2 | | 3% | |
| | CPI(M) | 0 - 1 | | 1% | |
| | IND (APHLC) | 0 - 2 | | | |
| Others | Others | 0 - 3 | 0 - 3 | 14% | 14% |

# 'ధురంధర్' తర్వాత రణ్‌వీర్ కొత్త ప్రాజెక్ట్ ఇదే... పుకార్లకు చెక్!

**రణ్‌వీర్ సింగ్ 'ప్రళయ్' ఆగిపోయిందన్న వార్తల్లో నిజం లేదన్న టీమ్**
**నటుడు, దర్శకుడి మధ్య విభేదాలు లేవని స్పష్టీకరణ**
**ఆగస్టు 2026 నుంచి సినిమా షూటింగ్ ప్రారంభం**
**రూ.300 కోట్ల బడ్జెట్‌తో భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా చిత్రం**
**ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

'ధురంధర్' ఫ్రాంచైజీతో భారీ విజయాన్ని అందుకున్న బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, దర్శకుడు జై మెహతాతో కలిసి 'ప్రళయ్' అనే పోస్ట్-అపోకలిప్టిక్ థ్రిల్లర్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ వార్తలు గుప్పుమన్నాయి. రణ్‌వీర్‌కు, దర్శకుడికి మధ్య సృజనాత్మక విభేదాలు తలెత్తాయని, దాంతో సినిమాను పక్కన పెట్టారని ప్రచారం జరిగింది. ఈ పుకార్లపై చిత్రబృందానికి చెందిన సన్నిహిత వర్గాలు స్పందించాయి. 'ప్రళయ్' ఆగిపోయిందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు. "ప్రళయ్ సినిమా గురించి వస్తున్న ఊహాగానాలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్ ప్రకారమే ముందుకు సాగుతోంది" అని తెలిపారు. అంతేకాకుండా, ఈ ఏడాది ఆగస్టు నుంచి సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, స్క్రిప్ట్‌ను రణ్‌వీర్, జై మెహతా ఇప్పటికే ఫైనల్ చేశారని పేర్కొన్నారు. సుమారు రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో, విజువల్ ఎఫెక్ట్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ సినిమాను రూపొందించనున్నారు. జాంబీల నేపథ్యంలో, భారతీయ సినిమాలో మునుపెన్నడూ చూడని విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హన్సల్ మెహతా, రణ్‌వీర్ సింగ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రణ్‌వీర్ సరికొత్త లుక్‌లో కనిపిస్తారని సమాచారం.

# 8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయాలి

**బీఆర్ఎస్‌వీ పిలుపు - బంద్ నేపథ్యంలో నేత డా. జెట్టి రాజేందర్ అరెస్ట్‌పై ఉద్రిక్తత**

**హన్మకొండ, 29 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్‌వీ) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ నాయకుడు డా. జెట్టి రాజేందర్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం వివాదాస్పదమైంది. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వగా, హనుమకొండలో ఉద్రిక్తత నెలకొంది. తెల్లవారుజామునే పోలీసులు డా. జెట్టి రాజేందర్ నివాసానికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకుని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్ట్‌ను బీఆర్ఎస్‌వీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా డా. జెట్టి రాజేందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సుమారు ?8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులను ఉన్నత విద్య నుండి దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం న్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తూ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. విద్యార్థులతో విరోధంగా వ్యవహరించిన ప్రభుత్వాలు చరిత్రలో నిలబడలేదని హెచ్చరిస్తూ, వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం సరికాదని, తమను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రభుత్వ వైఖరిని బయటపెడుతోందని తెలిపారు. ఇక బంద్ ప్రభావంతో




పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలు మూతపడ్డాయి. కొన్ని చోట్ల విద్యార్థులు నిరసనలకు దిగగా, పోలీసులు ముందస్తు చర్యలతో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ప్రయత్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశంపై రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

## హాసన్‌పర్తి మండలంలో ఎస్ఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ఘన విజయం



DOMA ARPITHA,



Kommula Rohini Priya

**హన్మకొండ జిల్లా/హాసన్‌పర్తి, ఏప్రిల్ 29, 2026 (జై భీమ్ న్యూస్)**

హాసన్‌పర్తి మండలంలో ఈ ఏడాది పదవ తరగతి (ఎస్ఎస్సీ) ఫలితాలు విశేషంగా నమోదై, ప్రభుత్వ పాఠశాలలు తమ ప్రతిభను చాటాయి. మండలంలో మొత్తం ఉత్తీర్ణత శాతం 99.08గా నమోదు కాగా, జిల్లాలో నాలుగవ స్థానాన్ని సాధించడం గర్వకారణంగా నిలిచింది. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో 8 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రభుత్వ మరియు ప్రైవేట్ కలిపి ఉన్న మొత్తం 37 పాఠశాలల్లో 26 పాఠశాలలు పూర్తి ఉత్తీర్ణత నమోదు చేయడం విశేషం. ఈ సంవత్సరం మొత్తం 1867 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 1852 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలలలో జడ్పిహెచ్‌ఎస్ వంగపహాడ్‌కు చెందిన డి. అర్పిత 545 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. గురుకుల పాఠశాలల్లో టీఎస్ ఆర్ఎస్ హాసన్‌పర్తి బాలికల పాఠశాలకు చెందిన కే. రోహిణి ప్రియ 580 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. జెడ్‌పీహెచ్‌ఎస్ వంగపహాడ్, దేవన్నపేట, హాసన్‌పర్తి బాలుర పాఠశాల, మల్లారెడ్డిపల్లి, ముచ్చర్ల, పెగడపల్లి, సీతంపేట, సిద్ధాపూర్ పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచాయి. అలాగే కేజీబీవీ హాసన్‌పర్తిలో పరీక్ష రాసిన 45 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఈ విజయానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించిన ప్రత్యేక తరగతులు మరియు విద్యార్థులపై చూపిన ప్రత్యేక శ్రద్ధ ముఖ్య కారణమని మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను గమనించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన సూచించారు.

## వరంగల్ జిల్లాలో ఎస్ఎస్సీ మార్చి-2026 ఫలితాలు విడుదల

**మొత్తం ఉత్తీర్ణత శాతం 95.17శాతం నమోదు**

**వరంగల్, 29 ఎప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**



వరంగల్ జిల్లాలో నిర్వహించిన ఎస్ఎస్సీ మార్చి--2026 పరీక్షల ఫలితాలను జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్య విడుదల చేశారు. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 9,715 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 9,492 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 95.17గా నమోదైంది. బాలుర ఉత్తీర్ణత శాతం 94.70 కాగా, బాలికలు 95.69 శాతం ఉత్తీర్ణత సాధించి ముందంజలో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం 0.99శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 136 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్, ఆశ్రమ, రెసిడెన్షియల్ మరియు ప్రైవేట్ పాఠశాలలు మంచి ఫలితాలు నమోదు చేశాయి. ముఖ్యంగా రెసిడెన్షియల్ మరియు వెల్ఫేర్ పాఠశాలలు అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించాయి. విభాగాల వారీగా చూస్తే, ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో విద్యార్థులు గణనీయంగా ఉత్తీర్ణత సాధించారు. మండలాల వారీగా కూడా ఉత్తీర్ణత శాతం మంచి స్థాయిలో నమోదైంది. కొన్ని మండలాలు 99%కు పైగా ఉత్తీర్ణత సాధించి ప్రత్యేకంగా నిలిచాయి. ఈ పరీక్షల్లో అత్యధికంగా 589 మార్కులు సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. జిల్లాలో పలువురు విద్యార్థులు 570కు పైగా మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. అభ్యర్థులు తమ మార్కులపై సందేహాలు ఉంటే రీ-వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.1000 చెల్లించి 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుండి 12 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్య మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల శ్రమ, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

## విద్యార్థుల కృషి-ఉపాధ్యాయుల అంకితభావమే ఈ విజయానికి కారణం - ప్రిన్సిపాల్ వి. అలేఖ్య

**ఎస్ఎస్సి ఫలితాల్లో నక్కలగుట్ట నారాయణ స్కూల్ దుమ్మురేపింది - 100% ఉత్తీర్ణత, అత్యుత్తమ మార్కులతో సత్తా చాటిన విద్యార్థులు**




**హన్మకొండ, 29 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నక్కలగుట్టలోని నారాయణ స్కూల్ (ఓ.ఎన్ సి.ఎస్) 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్సి పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి 100 శాతం ఉత్తీర్ణతతో మరోసారి తన అకాడెమిక్ ప్రతిభను చాటుకుంది. ఈ ఫలితాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల విశ్వాసానికి నిదర్శనంగా నిలిచాయి. ఈ ఫలితాల ప్రకటన కార్యక్రమంలో వరంగల్ జోన్ డీజీఎం రిజ్వానా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి. అలేఖ్య విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, వారి విజయాలు, భవిష్యత్తు విద్యా-వృత్తి అవకాశాలపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. ఈ సంవత్సరం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 570 పైగా మార్కులు సాధించిన విద్యార్థి ఒకరు ఉండగా, 560 పైగా మార్కులు సాధించిన వారు 7 మంది, 550 పైగా మార్కులు సాధించిన వారు 11 మంది, 500 పైగా మార్కులు సాధించిన వారు 21 మంది ఉన్నారు. మొత్తం క్లాస్ సగటు 537గా నమోదైంది. ముఖ్యంగా గణితంలో 6 మంది విద్యార్థులు 100/100 మార్కులు సాధించడం ఈ ఫలితాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా నారాయణ విద్యాసంస్థలు రాష్ట్ర స్థాయిలో కూడా ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. 597 మార్కులు సాధించిన 7 మంది విద్యార్థుల్లో 4 మంది, 595 మార్కులు సాధించిన 16 మందిలో 6 మంది (సుమారు 37శాతం), 591 మార్కులు సాధించిన 92 మందిలో 30 మంది (సుమారు 32.6శాతం), 590 మార్కులు సాధించిన 101 మందిలో 40 మంది (సుమారు 39.6శాతం), 590 పైగా మార్కులు సాధించిన 341 మందిలో 116 మంది (సుమారు 34శాతం) నారాయణ విద్యాసంస్థలకు చెందినవారే కావడం విశేషం. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి. అలేఖ్య మాట్లాడుతూ, "విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల విశ్వాసం కలిసి ఈ విజయాన్ని సాధించాయి. భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించేందుకు మేము కట్టుబడి ఉన్నాము," అని తెలిపారు. కార్యక్రమంలో అకాడెమిక్ డీన్ రాజశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు విజయాల కోసం శుభాకాంక్షలు తెలిపారు.

## కాజీపేట నారాయణ పాఠశాల నుంచి పదవ తరగతిలో ఘన విజయం

**కాజీపేట, 29 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట నారాయణ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. మొత్తం 37 మంది విద్యార్థులలో గూడూరు వాన్మయి 576 మార్కులతో మొదటి స్థానం సాధించగా, గోనెల శివాత్మిక 572 మార్కులతో రెండో స్థానం, బోగి రష్మిక 570 మార్కులతో మూడో స్థానం దక్కించుకున్నారు. అదనంగా, మొత్తం విద్యార్థుల్లో 28 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ సందర్భంగా జోనల్ డిజిఎం రిజ్వాన ఇమ్రాన్ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తేజావత్ అనిత, అకడమిక్ డీన్ బండి రాకేష్, పదవ తరగతి ఇంచార్జ్ హఫీజ్ పాషా, ఏఓ గుంపుల చేరాలు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం తల్లిదండ్రుల సమక్షంలో మొదటి, రెండో, మూడో స్థానాలు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు.




## కొంపదీసి తుమ్మును ఆపుతున్నారా ఏంటి? చెవులు, మెదడుకు ముప్పు తెచ్చుకోవడమే!

**శరీరంలోని సున్నితమైన భాగాలపై ఒత్తిడి**
**చెవి కర్ణభేరికి తీవ్ర ముప్పు**
**సైనస్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం**
**బీపీ, ఆస్తమా ఉన్నవాళ్లకు మరీ ప్రమాదం**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

పదిమందిలో ఉన్నప్పుడు ఇబ్బందిగా అనిపించి కొంతమంది తుమ్మును బలవంతంగా ఆపుకుంటారు. అయితే ఇలా తుమ్మును అణచివేయడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తుమ్ము కేవలం శారీరక చర్య మాత్రమే కాదు. అది మన శ్వాసనాళాల్లో ఉండే దుమ్ము, ధూళి, సూక్ష్మక్రిములను బయటకు పంపే ఒక ప్రతిక్రియ. మనం ముక్కును గట్టిగా పట్టుకుని లేదా నోరు మూసుకుని తుమ్మును ఆపినప్పుడు ఆ వేగంతో వచ్చే ఒత్తిడి తిరిగి శరీరంలోని సున్నితమైన భాగాల వైపు మళ్లుతుంది. దీంతో తల, శ్వాస వ్యవస్థలోని సున్నితమైన భాగాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముక్కు, గొంతులో ఒత్తిడి ఒక్కసారిగా పెరుగుతుంది. ఫలితంగా ముక్కులోని శ్లేష్మం (ముక్కు నీరు), గాలి కలిపి యూస్టాచియన్ ట్యూబ్ ద్వారా మధ్య చెవిలోకి వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల చెవిలో నొప్పి రావడం, ఇన్ఫెక్షన్లు కలగడం, అరుదైన సందర్భాల్లో చెవి కర్ణభేరి చిరిగిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. అలాగే శ్లేష్మం తిరిగి సైనస్ రంధ్రాల్లోకి వెళ్లడం వల్ల అక్కడ బ్యాక్టీరియా చేరి సైనస్ నొప్పి, ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. తుమ్మును ఆపడం వల్ల గొంతులోని కణజాలం దెబ్బతినే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అలాగే కళ్లలోని లేదా మెదడులోని చిన్న చిన్న రక్తనాళాలపై కూడా ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా రక్తపోటు (బీపీ), ఆస్తమా, సైనస్ సమస్యలు ఉన్నవారు తుమ్మును అస్సలు ఆపొద్దు. ఇది వారి అనారోగ్యాన్ని మరింత పెంచుతుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. తుమ్ము వచ్చినప్పుడు దాన్ని ఆపకుండా ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ముక్కు, నోటికి అడ్డంగా టిష్యూ పేపర్ ఉంచుకోవాలి. లేదంటే మోచేయిని అడ్డం పెట్టుకోవాలి. తుమ్మిన తర్వాత టిష్యూను పారేసి, చేతులను శుభ్రం చేసుకోవాలి. తుమ్మును ఆపడం నాగరికత అని భావించొద్దు. మీ శరీరం బయటకు పంపాలనుకుంటున్న వ్యర్థాలను ఆపడం అంటే రోగాలను ఆహ్వానించడమేనని డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు.

## హసన్‌పర్తిలో సెయింట్ మేరీస్ జైత్రయాత్ర - ఎస్ఎస్సిలో అద్భుత ఫలితాలు

**హసన్‌పర్తి, 29 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**




తెలంగాణ రాష్ట్రంలో బుధవారం ప్రకటించిన పదవ తరగతి (ఎస్ఎస్సి) ఫలితాల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పాకాల తిరుమలేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది పరీక్షలకు హాజరైన 38 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులై పాఠశాల ప్రతిష్టను మరింతగా పెంచారని తెలిపారు. ముఖ్యంగా 578 మార్కులు సాధించిన రిషికేష్ రెడ్డి మండల టాపర్‌గా నిలిచి పాఠశాలకు గర్వకారణమయ్యాడని పేర్కొన్నారు. అదేవిధంగా 567, 565, 550, 549, 547 మార్కులతో పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. మొత్తం 20 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం పాఠశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని అన్నారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. అలాగే విద్యార్థుల అభివృద్ధికి అండగా నిలిచిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయంతో సెయింట్ మేరీస్ పాఠశాల మరోసారి తన ప్రతిష్టను నిలబెట్టుకుని, ప్రాంతీయంగా ఆదర్శ విద్యాసంస్థగా నిలిచింది.

## వరంగల్‌లో ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

**వరంగల్, 29 ఎప్రిల్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. వివరాల ప్రకారం, ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ యం. యాదగిరి నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు చెల్లించని వారి ఇంటిపై దాడి చేసినందుకు సస్పెండ్ అయ్యారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ టి. రాములు మద్యం సేవించి నైట్ ఇంచార్జి విధులు నిర్వహించినందుకు సస్పెన్షన్‌కు గురయ్యారు. అలాగే చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సతీష్ స్టేషన్ అధికారి ఆదేశాలను అతిక్రమించినందుకు సస్పెండ్ చేయబడ్డారు. శాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# ఘనంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరం మహాదేవపుర నియోజకవర్గాలోని భువనేశ్వర్ నగరంలోని భువనేశ్వరి దేవి ఆలయం ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవం కర్ణాటక సయోధ్య కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. నగరంలో బెంగళూరు పూర్వ తాలూకాకు చెందిన భువనేశ్వర్ నగర్ లో భువనేశ్వరి దేవస్థానం ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవం కర్ణాటక సయోధ్య కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నాలి కృష్ణప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, అనంతరం ప్రసంగించారు. అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి అంకితం చేశారు. దేశ ప్రగతికి రాజ్యాంగమే పునాది. ఇది ప్రపంచంలో ఒక బలమైన దేశంగా ముందుకెళ్తోంది. మనమందరం రాజ్యాంగం పరిధిలో పనిచేస్తున్నాము. అంటరానితనం, కుల వివక్ష వంటి సమస్యలు వారిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఇవన్నీ అనుభవించి, వారు విద్యను పొందడంలో కీలక పాత్ర పోషించి, పోరాటం ద్వారా సాంఘిక సంస్కరణకు తమను తాము అంకితం చేసుకున్నారు. వారి ఆలోచనలు, ఆశయాల గురించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాము అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శోభా గౌడ, ఎల్. ఉమాదేవి, అనితా శ్రీనివాస్, సౌమ్య కమల్, రాజన్న , స్థానిక యువకులు డి.కె. గోపాల్, ఇమ్రాన్, కృష్ణ వి. గట్టిగుండ్ గిరీష్, విజయ్ కుమార్, ముకుంద, శివ, వెంకటేష్, వసంత్ కుమార్, మురుగన్, కృష్ణప్ప, శశికమార్, కె.సి. బాబు, మహేష్, ఇ. కృష్ణప్ప, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.





# హన్మకొండ జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో 98.56% ఉత్తీర్ణత


### రాష్ట్రంలో 9వ స్థానం... బాలికలే ముందంజ



**హన్మకొండ, 29 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

హన్మకొండ జిల్లాలో నిర్వహించిన పదవ తరగతి (ఎస్ఎస్సీ) మార్చి–2026 పరీక్షల ఫలితాలు విడుదల కాగా, జిల్లా మరోసారి అద్భుత ప్రతిభ కనబర్చింది. మొత్తం 98.56 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి రాష్ట్ర స్థాయిలో 9వ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఫలితాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమిష్టి కృషికి ప్రతిబింబంగా నిలిచాయి. జిల్లాలో మార్చి 14 నుంచి ఏప్రిల్ 15 వరకు జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 12,065 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 11,891 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై జిల్లా అత్యుత్తమ ఫలితాలను నమోదు చేసింది. బాలురతో పోలిస్తే బాలికలు మరోసారి మెరుగైన ఫలితాలను సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. వివరాల ప్రకారం, బాలురలో 6,310 మంది పరీక్షలు రాయగా, 5,755 మంది ఉత్తీర్ణులై 98.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక బాలికల్లో 6,204 మంది పరీక్షలకు హాజరై, 5,687 మంది ఉత్తీర్ణులై 98.82 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మొత్తం మీద బాలికలు బాలుర కంటే మెరుగైన ఫలితాలను సాధించడం విశేషం. జిల్లాలోని పాఠశాలల ప్రదర్శన కూడా గమనార్హంగా నిలిచింది. మొత్తం 67 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణతను నమోదు చేయగా, వాటిలో 3 ప్రభుత్వ పాఠశాలలు మరియు 8 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ) కూడా శాతం 100 ఫలితాలు సాధించడం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని సూచిస్తోంది. ఇక పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 5 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకావాలనుకునే విద్యార్థులు మే 14లోపు ఫీజు చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లాలో సాధించిన ఉత్తమ ఫలితాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం మీద హన్మకొండ జిల్లా విద్యారంగంలో మరోసారి తన ప్రతిభను చాటుకొని రాష్ట్రంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

# తెలంగాణలో ఐఎఫ్ఎస్ అధికారుల విస్తృత బదిలీలు




**హైద్రాబాద్, 29 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో అటవీ శాఖలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారులను పెద్ద ఎత్తున బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ జిల్లాలు, విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ, దులపల్లిలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్/అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్. రమేష్‌ను హైదరాబాద్ రీసెర్చ్, డెవలప్మెంట్ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా బదిలీ చేశారు. అదే అకాడమీలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న బి. ప్రవీణను ములుగు ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డీన్‌గా నియమించారు. జిల్లా స్థాయిలో కూడా కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా ఫారెస్ట్ అధికారిగా ఉన్న సీహెచ్. బాలమణిని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేయగా, కామారెడ్డి జిల్లా ఫారెస్ట్ అధికారి బొగ నిఖితను వరంగల్ జిల్లాకు నియమించారు. నిజామాబాద్ జిల్లా నుంచి వికాస్ మీనాను ములుగు జిల్లాకు, మంచిర్యాల జిల్లా నుంచి శివ ఆశీష్ సింగ్‌ను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే ఖమ్మం జిల్లా ఫారెస్ట్ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్‌ను నిజామాబాద్ జిల్లాకు, ములుగు జిల్లా నుంచి రాహుల్ కిషన్ జాదవ్‌ను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి నీరజ్ కుమార్ తిబ్రేవాల్‌ను కామారెడ్డి జిల్లాకు, వరంగల్ జిల్లా నుంచి అనుజ్ అగర్వాల్‌ను ఖమ్మం జిల్లాకు నియమించారు. ఇంకా, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా పనిచేస్తున్న ఎస్. సత్యనారాయణను రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా ఫారెస్ట్ అధికారిగా నియమించగా, వికారాబాద్‌లో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్/డీఎఫ్ఓగా ఉన్న జి. జ్ఞానేశ్వర్‌ను హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విస్తృత బదిలీలతో అటవీ శాఖలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, జిల్లాల వారీగా అటవీ పరిరక్షణ చర్యలు మరింత వేగవంతం అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి: స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి



**హన్మకొండ, 29 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వో సూపర్వైజర్లు, బీఎల్వోలతో కలిసి జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ఆమె సమీక్షించారు. పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో పూర్తయిన మ్యాపింగ్ పనులను పరిశీలించి, మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ 65.67 శాతం పురోగతిలో ఉన్నదని, వచ్చే పది రోజుల్లో కనీసం 90 శాతానికి చేర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల అనుసంధాన ప్రక్రియలో భాగంగా 2002 ఓటర్ల జాబితాతో తమ పేరు, తల్లిదండ్రులు లేదా తాతల వివరాలను పరిశీలించి సంబంధిత సమాచారం బీఎల్వోలకు అందజేయాలని ప్రజలను కోరారు. ప్రతి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సులభంగా సేవలు అందించాలని, కాలనీ పెద్దలు, సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు తమ సందేహాలను పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసిన కౌంటర్లను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, ఈఆర్వోలు/ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఏఈఆర్ఓలు/తహసిల్దారులు, బీఎల్వో సూపర్వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

# పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

మండల కేంద్రంలో పాత్ ఫైండర్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 500 పైన మార్కులు సాధించిన హంసిని-554,సమ్రీన్-549,తనియా-547, విష్ణు-545, సాయి పూజిత-538,మధు ప్రియ-536, ప్రణవి-534, సహస్ర-523, సాయి మహేష్-517,విగ్నేష్-514, రిత్విక్-503 మరియు హర్షిత్-500,500 కి పైన 12 మంది విద్యార్థులు 99% తో ఉత్తీర్ణులైన 10మంది విద్యార్థులను బుధవారం పాఠశాల డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్ యండి సుభానోద్దీన్ అభినందించారు.ఈ సంవత్సరం పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత శాతం నమోదు చేసి సంస్థకు కీర్తి తెచ్చారని కొనియాడారు. విద్యార్థుల ఈ విజయానికి వారి కృషి, ఉపాధ్యాయుల సమర్థవంతమైన బోధన, తల్లిదండ్రుల నిరంతర సహకారం ప్రధాన కారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.




# వేసవి పరీక్షల నేపథ్యంలో పింగిళి డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం




**హన్మకొండ, 29 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

వేసవిలో జరుగుతున్న పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), హనుమకొండలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల హెల్త్ క్లబ్ మరియు జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శిబిరం ద్వారా ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. హనుమకొండకు చెందిన ఎస్సార్ మెడికల్ ఏజెన్సీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి సహకారంతో హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేసినట్లు వెల్లడించారు. ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, విద్యార్థులు సరైన పద్ధతిలో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. వడ్డేపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికా మాట్లాడుతూ వేసవిలో విద్యార్థుల్లో వడదెబ్బ, డీహైడ్రేషన్, చర్మ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తల కోసం ఈ శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ శిబిరంలో నూట యాభైకి పైగా విద్యార్థులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు రోజుకు ఎక్కువగా నీరు తాగడం, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవడం, మధ్యాహ్నం ఎండలో ఎక్కువగా తిరగకుండా ఉండడం, కూల్ డ్రింక్స్ మరియు రోడ్డు పక్కన లభించే ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని మాట్లాడుతూ విద్యార్థులు జంక్ ఫుడ్‌ను నివారించి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ కేర్ సిబ్బంది కమలాకర్ పర్యవేక్షణలో విద్యార్థులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కన్వీనర్ డా. పి. సుభాషిణి, సిఎస్ఆర్ కన్వీనర్ డా. డి. రామకృష్ణారెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. డి. సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. అరుణ, అధ్యాపకులు డా. జె. లకన్ సింగ్, డా. బి. కల్పన తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ములుగు జిల్లా పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానం

**ములుగు, 28 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**



బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విజయానికి కారణమైన విద్యార్థినీ, విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో మొత్తం 3,287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 3,264 మంది ఉత్తీర్ణత సాధించి 99.30 శాతం ఫలితంతో రాష్ట్రంలో అగ్రస్థానాన్ని సాధించడం విశేషమని తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో కూడా ఇదే స్థాయిలో ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఏటూరునాగారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. కృష్ణ 589 మార్కులతో జిల్లాలో మొదటి స్థానం సాధించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు.

# 35 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్లకు డీఎస్పీ పదోన్నతులు

### రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైద్రాబాద్, 29 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం పోలీసు విభాగంలో కీలక నిర్ణయం తీసుకుంటూ 35 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్లకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోలీసు శాఖలో సీనియారిటీ, మెరిట్, సేవా రికార్డులను ఆధారంగా చేసుకుని ఈ పదోన్నతులు మంజూరు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పదోన్నతుల్లో సి.ఐ.డి, ఇంటెలిజెన్స్, ఏసీబీ, ట్రాఫిక్, సీసీఎస్, టాస్క్ ఫోర్స్ వంటి కీలక విభాగాల్లో సేవలందిస్తున్న అధికారులు ఉన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్, ఖమ్మం, జగిత్యాల, మహబూబాబాద్, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. పదోన్నతులు పొందిన అధికారుల్లో ఎస్. వెంకటేష్, కె. రవీందర్, సి. విజయ రాజు, జి. వెంకటేశ్వర్లు, బి. ప్రవీణ్, బి. శ్రీనివాస్, ఎం. వెంకటనర్సయ్య, జి. మహేందర్ రెడ్డి, జి. సీతా రెడ్డి, బి. బాలాజీ, అదపా నరసింహా రావు, ఎం. వెంకట రామయ్య, పి. వెంకటేశ్వర్లు, కె. రామకృష్ణ, కె. భాస్కర్, పి. కరుణాకర్, ఎం. వెంకట్ రెడ్డి, పి. రాజు, ఎన్. వెంకటేశ్వర్లు, జి. గోవర్ధన గిరి, ఎస్. వెంకటేష్, బి. గురు నాయుడు, భూపతి గట్టుమల్లు, బి. హరినాథ్ బాబు, చి. రాజి రెడ్డి, ఆర్. నరేందర్, ఎ. రాజయ్య, బి. శ్రీనివాస్ రావు, ఎ. పెద్దన్న కుమార్, టి. స్వామి, టి. ప్రవీణ్ కుమార్, కె. పురుషోత్తం, సర్ల రాజు, గడ్డం సదయ్య (సదన్ కుమార్), ఎం. రాజేష్ ఉన్నారు. ప్రస్తుతం సర్కిల్ ఇన్స్పెక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఈ అధికారులు డీఎస్పీ స్థాయికి పదోన్నతి పొందడం ద్వారా పోలీసు శాఖలో పరిపాలనా సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిర్ణయం పోలీసు శాఖలో ఉన్నత స్థాయి బాధ్యతలు నిర్వహించేందుకు అర్హత కలిగిన అధికారులకు మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది. పదోన్నతి పొందిన అధికారులు త్వరలోనే తమ కొత్త బాధ్యతలు స్వీకరించనుండగా, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందిస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## చికెన్ మాఫియా పంజా: రైతు నష్టాల్లో... వినియోగదారుడికి భారంగా చికెన్ ధరలు





**వరంగల్, 29 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో బ్రాయిలర్ పౌల్ట్రీ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. కార్పొరేట్ కంపెనీల అడ్డగోలు విధానాలు, మార్కెట్లో 'మైనస్ రేట్ల' దోపిడీ కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, మరోవైపు తక్కువ ధరల కారణంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఒక బ్రాయిలర్ కోడిని పెంచడానికి రైతుకు సుమారు ?230 వరకు ఖర్చవుతోంది. అంటే కిలోకు సుమారు ?115 వ్యయం అవుతోంది. అయితే మార్కెట్లో రైతుకు లభిస్తున్న ధర మాత్రం కేవలం ?90 నుంచి ?95 మధ్యే ఉండటంతో, ప్రతి కిలోపై ?20 నుంచి ?25 వరకు నష్టం చవిచూస్తున్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు అమలు చేస్తున్న 'మైనస్ రేట్ల' విధానం రైతులపై మరింత భారాన్ని మోపుతోంది. పేపర్ రేట్లు ప్రకటించినప్పటికీ, ట్రేడర్లకు రాయితీలు ఇస్తూ రైతులకు తక్కువ ధరలు చెల్లించడం జరుగుతోంది. దీని వల్ల రైతులు అదనంగా ?18 నుంచి ?20 వరకు నష్టపోతున్నారు. వేసవి తీవ్రత కూడా పౌల్ట్రీ రంగాన్ని కుదేలు చేస్తోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల మరణాల రేటు పెరుగుతుండగా, నాణ్యతలేని కోడిపిల్లల సరఫరా రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. కరెంటు ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు కూడా పెరగడంతో పరిస్థితి మరింత విషమంగా మారింది. ఇదిలా ఉండగా, రైతుకు సరైన ధర లభించకపోయినా వినియోగదారుడికి మాత్రం చికెన్ ధరలు తగ్గడం లేదు. చికెన్ సెంటర్లు కంపెనీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నాయి. విత్ స్కిన్పై ?45 వరకు, స్కిన్ లెస్పై ?52 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మధ్యవర్తులే లాభపడుతూ, రైతు--వినియోగదారుడు ఇద్దరూ నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో పౌల్ట్రీ రైతులు పలు డిమాండ్లు చేస్తున్నారు. ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా కిలోకు కనీసం ?126 పేపర్ రేటు నిర్ణయించాలని, 'మైనస్ రేట్ల' విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా "వన్ నేషన్ -- వన్ రేట్" విధానం అమలు చేయాలని, కంపెనీలు నాణ్యమైన కోడిపిల్లల సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేలా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే వేలాది రైతు కుటుంబాలు ఆర్థికంగా కుదేలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ ధార కవిత ఆకస్మిక తనిఖీ

### పెండింగ్ కేసులపై వేగం పెంచాలని ఆదేశం







**వరంగల్/హసన్‌పర్తి, 29 ఏప్రిల్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత బుధవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీసు వ్యవస్థ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌లో నిర్వహణ, కేసుల పరిష్కారం, ప్రజలతో పోలీసుల సంబంధాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై వివరాలు తెలుసుకున్న డీసీపీ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేర నియంత్రణలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి కేసును సమగ్రంగా విచారణ చేసి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అలాగే స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, జనరల్ డైరీ, ఇతర రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించిన ఆమె, రికార్డుల నిర్వహణలో కచ్చితత్వం, పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ఆధునిక విధానాలను అనుసరిస్తూ డాక్యుమెంటేషన్‌ను మెరుగుపర్చాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను పోలీసు అధికారులు తరచూ సందర్శిస్తూ ప్రజలతో నేరుగా మమేకం కావాలని, పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించేలా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండటం ద్వారా సమస్యలను త్వరగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేకంగా యువతను దృష్టిలో ఉంచుకుని సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నుండి ప్రజలను రక్షించేందుకు చైతన్యం అవసరమని చెప్పారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీఐ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. డీసీపీ ధార కవిత మాట్లాడుతూ, పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడం ద్వారా బాధితులకు న్యాయం చేయాలి. గ్రామాల స్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించాలి. ముఖ్యంగా యువతలో సైబర్ నేరాలపై అవగాహన పెంచడం అత్యంత అవసరం. రోడ్డు భద్రతపై కూడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలి," అని పేర్కొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్ష వాయిదా - కొత్త తేదీ ప్రకటింపు

**వరంగల్, 29 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించనున్న డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడినట్లు పరీక్ష నియంత్రణాధికారి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ప్రెస్ నోట్ ప్రకారం, బి.ఏ/ బి.కామ్ (జనరల్, కంప్యూటర్స్), బి.బి.ఏ మరియు బి.ఎస్సీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ (2024--2025, 2025--2026 బ్యాచులు), ఎక్స్-క్యాండిడేట్స్ (2023--2024 బ్యాచ్) పరీక్షలు 25-04-2026 (శనివారం) జరగాల్సి ఉండగా, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్టీసీ) ఉద్యోగుల బంద్ పిలుపు కారణంగా ఈ పరీక్షను 05-05-2026 (మంగళవారం)కు వాయిదా వేశారు. అయితే మిగిలిన పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల సమయం మరియు కేంద్రాల్లో కూడా మార్పులు ఉండవని తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించి కొత్త తేదీ ప్రకారం పరీక్షలకు హాజరుకావాలని విశ్వవిద్యాలయ అధికారులు సూచించారు.

## వరంగల్‌లో భద్రకాళీ దేవస్థానంలో ఘనంగా కళ్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగింపు



**వరంగల్, 29 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

చరిత్రప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో జరుగుతున్న భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. బుధవారం రోజున బ్రహ్మోత్సవాల పదకొండవ రోజు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు పూర్తి చేసి, చతుస్థానార్చన అనంతరం అమ్మవారికి శరభవాహన సేవ నిర్వహించారు. సాయంత్రం పుష్పరథంపై అమ్మవారిని ఊరేగిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలను ఉమ్మడి వరంగల్ జిల్లా పెరిక కుల (పురగిరి క్షత్రియ) సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పట్టువస్త్రాలు, పూలు, పండ్లు, పూజా సామగ్రిని శిరస్సుపై ధరించి మేళతాళాలతో, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం షోడశోపచార పూజలు, అభిషేకాలు నిర్వహించగా, మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. బలిహరణ అనంతరం జరిగిన శరభవాహన సేవలో భక్తులు "భద్రకాళీ శరణం మమ" అంటూ నామస్మరణ చేస్తూ ఆలయ ప్రాంగణాన్ని మారుమ్రోగించారు. ఈ సందర్భంగా శ్రీ మోటపలుకుల శ్రీనివాస్వర్మ--కృష్ణవేణి దంపతుల సౌజన్యంతో సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. బుధవారం రోజున కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పెరిక కుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు గటిక విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఇతర ప్రముఖులు, వివిధ జిల్లాల పెరిక కుల సంఘ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం నిర్వహించిన పుష్పరథ సేవను వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచుతూ వరంగల్ నగరంలో భక్తి పారవశ్యాన్ని నింపుతున్నాయి.

## కేయూలో ఇన్నోవేషన్ స్క్రీనింగ్ టెస్ట్ ప్రశాంతంగా ముగింపు



**హన్మకొండ, 29 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం, కే-హబ్ మరియు టి-హబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్క్యుబేషన్, ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్షిప్ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా బుధవారం స్క్రీనింగ్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించబడింది. టి-హబ్ అప్లికేషన్ మరియు సెలెక్షన్ ఫారమ్‌ను పూర్తి చేసిన విద్యార్థులకు ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించారు. మూడు కేంద్రాలలో ఈ పరీక్ష జరిగింది. యూనివర్సిటీ కాలేజీ, ఫార్మసీ కాలేజీ, కామర్స్ కాలేజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల విద్యార్థులు హ్యూమానిటీస్ బిల్డింగ్‌లో పరీక్ష రాయగా, కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్)లో, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినులు మహిళా ఇంజనీరింగ్ కాలేజీ కేంద్రంలో పరీక్షకు హాజరయ్యారు. మొత్తం మూడు పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఈ స్క్రీనింగ్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసినట్లు విశ్వవిద్యాలయ కే-హబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 1800 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షలో పాల్గొన్న వారిలో నుంచి 250 మంది విద్యార్థులను ఎంపిక చేసి తదుపరి దశలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఇంజనీరింగ్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్) ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె. భిక్షాలు చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిద్దార్ద, బొల్లం కిరణ్‌తో పాటు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డేపల్లిలో బైక్ ర్యాలీతో హిందూ ధర్మ సమ్మేళనానికి మద్దతు



**హన్మకొండ, 29 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

వడ్డేపల్లిలో మే 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో బుధవారం సాయంత్రం విస్తృతంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. వడ్డేపల్లి పోచమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, పరిసర బస్తీలు మరియు 11 కాలనీల గుండా కొనసాగింది. వందలాది మంది మహిళలు, పురుషులు, యువతి యువకులు ఉత్సాహంగా పాల్గొని సమ్మేళనంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ ర్యాలీని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వరంగల్ విభాగ్ సహసంఘచాలక్ పెద్దిరెడ్డి మల్లారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమ్మేళన సమితి అధ్యక్షులు కే. వెంకట్రావు, మహిళా అధ్యక్షురాలు పింగిలి స్వరూపారెడ్డి, పర్వాయే డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ భాస్కర్, అలాగే 11 కాలనీల కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ ఆలయాల ప్రతినిధులు, ధర్మకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ద్వారా హిందూ ధర్మ సమ్మేళనానికి విస్తృత మద్దతు లభించిందని నిర్వాహకులు తెలిపారు.

## కేయూ ఎల్.ఎల్.బి పరీక్ష ఫలితాలు విడుదల

**వరంగల్, 29 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎల్.ఎల్.బి కోర్సుల పరీక్షా ఫలితాలను ఈరోజు విడుదల చేశారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్లా అధికారికంగా ఫలితాలను ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, ఎల్.ఎల్.బి 3 సంవత్సరాల కోర్సు 5వ సెమిస్టర్ మరియు ఎల్.ఎల్.బి 5 సంవత్సరాల కోర్సు 9వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షలు గత ఏప్రిల్ 2న ముగిశాయి. ఆన్‌స్క్రీన్ మూల్యాంకన (ఆన్ - స్క్రీన్ ఇవాల్యుయేషన్) విధానం ద్వారా వేగవంతంగా పేపర్ల మూల్యాంకనం పూర్తి చేసి తక్కువ కాలంలోనే ఫలితాలను విడుదల చేయడం విశేషమని అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా పారదర్శకతతో పాటు సమయపాలన కూడా సాధ్యమైందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఫలితాలను విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు. ఫలితాల కోసం www.kakatiya.ac.in ని సందర్శించండి. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ద్వారా ఫలితాలను సులభంగా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# మరోసారి మెరిసిన ఏకశిల విద్యార్థుల ప్రతిభ

### పదవ తరగతి ఫలితాల్లో ఘన విజయం

**హన్మకొండ జిల్లా/ పెంబర్తి, 29 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

పదవ తరగతి ఫలితాల్లో ఏకశిల విద్యాసంస్థలు మరోసారి తమ ప్రతిభను చాటుతూ అద్భుత విజయాన్ని సాధించాయి. ఈ సంవత్సరం ప్రకటించిన సీబీఎస్ఈ, స్టేట్ బోర్డ్ పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి సంస్థకు గౌరవాన్ని తెచ్చిపెట్టారు. ఈ సందర్భంగా 585, 582, 580, 578, 577, 576, 574, 573, 572, 571, 570 వంటి ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులు తమ ప్రతిభ, కృషి, పట్టుదలతో విశేషంగా నిలిచారు. వరుసగా ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ఏకశిల విద్యాసంస్థలు విజయపథంలో ముందంజలో నిలవడం విశేషం. ఈ విజయాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా పెంబర్తి, హసన్పర్తిలోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డా. గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, "ఏకశిలలో విద్య అంటే కేవలం మార్కులు మాత్రమే కాదు, విద్యార్థుల భవిష్యత్తును నిర్మించే శక్తి. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉందని మేము నమ్ముతున్నాం. ఆ ప్రతిభను వెలికి తీసి విజయంగా మలచడం మా లక్ష్యం" అని పేర్కొన్నారు. అలాగే నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జీవిత నైపుణ్యాలను పెంపొందించడంపై తమ సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. విద్యార్థులను కేవలం పరీక్షల కోసమే కాకుండా భవిష్యత్ జీవితానికి సిద్ధం చేసే విధంగా విద్య అందిస్తున్నామని చెప్పారు. ఈ విజయంతో సంస్థకు మరింత గౌరవం, గుర్తింపు పెరిగిందని పేర్కొంటూ, తమపై విశ్వాసం ఉంచిన తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి కొనసాగిస్తామని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు బేతి కొండల్ రెడ్డి, సువిజా రెడ్డి, ప్రిన్సిపాల్స్ బేతి శైలజ రెడ్డి, ముచ్చ స్వప్న రెడ్డి, ఎండీ బాబా, కేడీ స్వర్ణ రాజ్, లవకుమార్, అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జ్ జి రామ్ ప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. మొత్తానికి, ఏకశిల విద్యాసంస్థలు మరోసారి తమ నాణ్యమైన విద్యా ప్రమాణాలను నిలబెట్టి, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ముందంజలో నిలిచాయి.




# నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణనలు.


# పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్పరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %డ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.



# గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.




# అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి.అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.



# పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?



వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.

# సన్‌రైజర్స్‌తో మ్యాచ్.. టాస్ గెలిచిన ముంబై... ఇవాళ కూడా 'హిట్ మ్యాన్' లేడు!

**హైదరాబాద్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై**

**ముంబై జట్టులో నాలుగు కీలక మార్పులు.. డికాక్‌కు గాయం**

**రోహిత్ శర్మ కోలుకోవడానికి మరికొన్ని మ్యాచ్‌ల సమయం పడుతుందని హార్దిక్ వెల్లడి**

**సన్‌రైజర్స్ జట్టులోకి ట్రావిస్ హెడ్, హర్ష్ దూబే**

**తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నామన్న కెప్టెన్ కమిన్స్**

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముంబై జట్టులో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో, 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ పునరాగమనం మరింత ఆలస్యం కానుందని హార్దిక్ స్పష్టం చేశాడు.టాస్ గెలిచిన అనంతరం హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ.. "మేం మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాం. వాతావరణం చల్లగా, గాలిగా ఉంది. కాబట్టి మంచు ప్రభావం ఉంటుందని అనుకోవడం లేదు. మంచి స్కోరు సాధించడమే మా లక్ష్యం," అని తెలిపాడు. క్వింటన్ డికాక్‌కు మణికట్టు గాయం కావడంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని, రోహిత్ శర్మ పూర్తిగా కోలుకోవడానికి మరో రెండు మ్యాచ్‌ల సమయం పడుతుందని వెల్లడించాడు.మరోవైపు, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాట్లాడుతూ.. తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నామని, పిచ్‌పై కొద్దిగా పచ్చిదనం ఉన్నందున బౌలింగ్‌కు మొగ్గు చూపేవాళ్లమని చెప్పాడు. సన్‌రైజర్స్ జట్టులో ట్రావిస్ హెడ్, హర్ష్ దూబే తిరిగి జట్టులోకి వచ్చారు.సన్‌రైజర్స్ హైదరాబాద్: అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, నితీష్ కుమార్ రెడ్డి, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), హర్ష్ దూబే, సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే, ఎషాన్ మలింగ.

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: స్మరణ్ రవిచంద్రన్, అనికేత్ వర్మ, హర్షల్ పటేల్, శివాంగ్ కుమార్, లియామ్ లివింగ్‌స్టోన్.

ముంబై ఇండియన్స్: ర్యాన్ రికెల్టన్ (వికెట్ కీపర్), విల్ జాక్స్, నమన్ ధీర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రాబిన్ మింజ్, ట్రెంట్ బౌల్ట్, జస్‌ప్రీత్ బుమ్రా, అల్లా మహ్మద్ ఘజన్‌ఫర్, అశ్వని కుమార్.

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: రాజ్ అంగద్ బావా, శార్దూల్ ఠాకూర్, రఘు శర్మ, మయాంక్ రావత్, క్రిష్ భగత్.



# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం.. అత్యంత వేగంగా 400 పరుగులు

**ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 400 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ**

**ఆండ్రీ రసెల్, అభిషేక్ శర్మ రికార్డులను అధిగమించిన యువ కెరటం**

**పంజాబ్‌పై 16 బంతుల్లో 43 పరుగులతో రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభం**

ఈ ఇన్నింగ్స్‌తో ఆరెంజ్ క్యాప్‌ను తిరిగి కైవసం చేసుకున్న వైభవ్

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రికార్డుల పరంపర కొనసాగిస్తున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఒకే సీజన్‌లో అత్యంత వేగంగా 400 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఘనతను కేవలం 167 బంతుల్లోనే అందుకోవడం విశేషం. ఈ క్రమంలో ఆండ్రీ రసెల్ (188 బంతులు), అభిషేక్ శర్మ (195 బంతులు) వంటి విధ్వంసకర ఆటగాళ్ల రికార్డులను అతను అధిగమించాడు.మంగళవారం (28న) పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఈ రికార్డును అందుకున్నాడు. 223 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అతడు ఔటయ్యేసరికి 4 ఓవర్లకే జట్టు స్కోరు 51 పరుగులకు చేరింది. వైభవ్ వేసిన ఈ బలమైన పునాదిపై యశస్వి జైస్వాల్ (27 బంతుల్లో 51) కూడా రాణించాడు. ఆ తర్వాత డొనోవన్ ఫెరీరా, శుభమ్ దూబే కీలక భాగస్వామ్యంతో రాజస్థాన్ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ విజయంతో ఈ సీజన్‌లో పంజాబ్‌కు తొలి ఓటమిని రుచి చూపించింది. ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ ఆరెంజ్ క్యాప్‌ను తిరిగి దక్కించుకున్నాడు. మ్యాచ్ అనంతరం వైభవ్ బ్యాటింగ్‌పై అతని ఓపెనింగ్ పార్టనర్ యశస్వి జైస్వాల్ ప్రశంసలు కురిపించాడు. "అతడితో కలిసి బ్యాటింగ్ చేయడం అద్భుతంగా ఉంది. అతడు ఆడుతున్న తీరును మరో ఎండ్ నుంచి చూడటం చాలా ఆనందంగా ఉంది. వైభవ్ చాలా చిన్నవాడు, అతడి గురించి ఏమి చెప్పాలో కూడా నాకు తెలియడం లేదు" అని జైస్వాల్ వ్యాఖ్యానించాడు.



# అతడి బ్యాటింగ్ సిసలైన సినిమా చూస్తున్నట్టే ఉంటుంది: పుజారా

**రాజస్థాన్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై పుజారా ప్రశంసలు**

**సూర్యవంశీ బ్యాటింగ్ ఒక సినిమా చూసినట్టు ఉంటుందని వ్యాఖ్య**

**పవర్‌ప్లేలో అతడి నిర్భయమైన ఆటే జట్టుకు కీలకం అన్న పుజారా**

**స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌ను కూడా కొనియాడిన వైనం**



రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై భారత మాజీ ఆటగాడు ఛటేశ్వర్ పుజారా ప్రశంసల వర్షం కురిపించాడు. అతడి బ్యాటింగ్ చూస్తుంటే ఒక సినిమా చూసిన అనుభూతి కలుగుతుందని పుజారా అభివర్ణించాడు. పంజాబ్ కింగ్స్‌తో గతరాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలిచిన నేపథ్యంలో పుజారా ఈ వ్యాఖ్యలు చేశాడు.ఈ మ్యాచ్‌లో 223 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సూర్యవంశీ కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ పుజారా దీనిపై స్పందించాడు. "వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ చేయడం ఒక సినిమాటిక్ అనుభవం. అతడు ఏ బౌలర్‌కైనా భయం లేకుండా ఎదురెళ్లే తీరు అద్భుతం. బంతిని చూసి, దానిని బాదడమే అతడికి తెలుసు. పవర్‌ప్లేలో అతడి దూకుడైన ఆటతీరే జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని ఇస్తోంది" అని పుజారా వివరించాడు.ఇదే సమయంలో, మధ్య ఓవర్లలో రాణించిన స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌ను కూడా పుజారా మెచ్చుకున్నాడు. "పరుగులు ఇచ్చినా చాహల్ ధైర్యంగా బంతులు వేసి వికెట్లు తీయడానికి ప్రయత్నించాడు. అతడి వైవిధ్యమైన బౌలింగ్ అద్భుతం. స్పీడ్‌లో మార్పులు చేస్తూ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు," అని తెలిపారు.ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి పంజాబ్‌కు సీజన్‌లో తొలి ఓటమిని రుచి చూపించింది.

# భారత బౌలర్లంటే ద్వేషం.. పాకిస్థాన్ క్రికెటర్ తీవ్ర వ్యాఖ్యలు!

**భారత బౌలర్లంటే తనకు ద్వేషమని పాక్ క్రికెటర్ హసన్ నవాజ్ వ్యాఖ్య**

**టీమిండియాతో ఆడేటప్పుడు ప్రత్యేక ప్రేరణ కలుగుతుందని వెల్లడి**

**ఈ వ్యాఖ్యలపై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల నుంచి ఆగ్రహం**

పాకిస్థాన్ క్రికెటర్ హసన్ నవాజ్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 సందర్భంగా ఒక స్థానిక న్యూస్ ఛానెల్‌తో మాట్లాడుతూ, భారత బౌలర్ల పట్ల తనకున్న అభిప్రాయాన్ని వివాదాస్పద రీతిలో వ్యక్తం చేశాడు. అతని మాటలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇంటర్వ్యూలో భాగంగా ఏ బౌలర్‌పై పరుగులు చేయడానికి ఇష్టపడతారని ప్రశ్నించగా, హసన్ నవాజ్ బదులిస్తూ.. "భారత్‌తో ఆడేటప్పుడు సహజంగానే అదనపు ప్రేరణ ఉంటుంది. వాళ్ల బౌలర్లపై దాడి చేయాలనే భావన కలుగుతుంది. నిజం చెప్పాలంటే వాళ్ల బౌలర్లందరినీ నేను ద్వేషిస్తాను. భవిష్యత్తులో అవకాశం వస్తే, కచ్చితంగా వాళ్ల బౌలింగ్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తాం" అని సంచలన వ్యాఖ్యలు చేశాడు.అయితే, కేవలం బౌలర్ పేరు చూసి కాకుండా, మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరు ఉంటుందని హసన్ నవాజ్ వివరించాడు. "అవసరమైన రన్ రేట్ 10, 12 లేదా 15 పరుగుల చొప్పున ఉన్నప్పుడు, బౌలర్ ఎవరనేది చూడకుండా పరుగులు చేయడానికి ప్రయత్నిస్తాం. అంతా మ్యాచ్‌పై ఆధారపడి ఉంటుంది" అని అన్నాడు.భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మైదానంలోనే కాకుండా వెలుపల కూడా తీవ్రమైన పోటీ ఉంటుంది. 2013 నుంచి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగనప్పటికీ, ఐసీసీ టోర్నమెంట్లలో మాత్రమే తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లలో భారత్‌దే స్పష్టమైన ఆధిపత్యం కొనసాగుతోంది.2025లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హసన్ నవాజ్, ఇప్పటివరకు 25 టీ20 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ (105 నాటౌట్), రెండు అర్ధసెంచరీలతో కలిపి 457 పరుగులు చేశాడు. అలాగే, 4 వన్డేలలో 56.50 సగటుతో 113 పరుగులు సాధించాడు. అతను చివరిసారిగా 2025 నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ తరఫున ఆడాడు. పీఎస్ఎల్ 2026లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 291 పరుగులు చేసినప్పటికీ, ఆ జట్టు కేవలం 3 విజయాలతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# లండన్ ప్రేమ కథతో ఆనంద్ దేవరకొండ 'ఎపిక్'.. టీజర్ వచ్చేసింది



**'బేబీ' హిట్ జోడీ మళ్లీ మ్యాజిక్**

**ఆదిత్య హాసన్ మార్క్ కామెడీ**

**యూకే నేపథ్యంలో సాగే ప్రేమకథ**

**ఆకట్టుకుంటున్న సినిమా టీజర్**

బేబీ' బ్లాక్ బస్టర్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. 'ఛ90ం: ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆదిత్య హాసన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ టీజర్ బుధవారం విడుదలై ఆసక్తిని రేకెత్తిస్తోంది.'90ం' సిరీస్‌లో మెప్పించిన ఆదిత్య పాత్ర చుట్టూనే ఈ సినిమా కథ తిరుగుతుంది. మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ఆ యువకుడు ఇంటి సభ్యుల ఒత్తిడితో పైచదువుల కోసం యూకే వెళతాడు. అక్కడ వైష్ణవీ చైతన్యతో ప్రేమలో పడితే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయనేది ఈ టీజర్‌లో చూపించారు. ఆనంద్ దేవరకొండ తన సహజ సిద్ధమైన నటనతో మధ్యతరగతి యువకుడిగా ఒదిగిపోయారు.పక్కా లోకల్ అబ్బాయి ఫారిన్ వెళితే పడే ఇబ్బందులను కామెడీగా చూపిస్తూనే, మరోవైపు ఎమోషనల్ లవ్ ట్రాక్‌ను కూడా ఆదిత్య హాసన్ టచ్ చేసినట్లు టీజర్‌ను బట్టి తెలుస్తోంది. యూకే నేపథ్యంలోని విజువల్స్ చాలా కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది. ఫస్ట్ సెమిస్టర్ అని టైటిల్‌లో ఉండటంతో ఇది యూత్, స్టూడెంట్స్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసినట్లు స్పష్టమవుతోంది.

## దూప్స్ లేకుండా మన హీరోలు ఫైట్లు చేయరు.. 90 శాతం మంది అలాగే చేస్తున్నారు: రవిబాబు

విలక్షణ నటుడిగా, ప్రయోగాత్మక చిత్రాల దర్శకుడిగా తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవిబాబు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన దర్శకత్వంలో రాబోతున్న కొత్త చిత్రం 'రేజర్' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. టాలీవుడ్ స్టార్ హీరోల పనితీరు, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణపై తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం పెను దుమారం రేపుతున్నాయి.

దూప్స్ లేకుండా ఫైట్ చేయరు

ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ... "మన టాలీవుడ్ ఇండస్ట్రీలో ఉన్న హీరోలలో 90 శాతం మంది స్వయంగా ఫైట్లు చేయరు. కేవలం దూప్స్ సహాయంతోనే యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేస్తారు" అంటూ బాంబు పేల్చారు. తెలుగు సినిమాల్లోని యాక్షన్ ఘట్టాలు వాస్తవికతకు ఆమడ దూరంలో ఉంటాయని, వాటిలో ఎలాంటి లాజిక్ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. "కావలసినంత సమయం, డబ్బు ఇస్తే ఎలాంటి వెధవ అయినా ఇక్కడ సినిమా చేయగలడు" అంటూ ఘాటైన విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు నేరుగా హీరోల సామర్థ్యాన్ని, పరిశ్రమలోని పోకడలను ప్రశ్నించేలా ఉన్నాయి.

మిస్టరీని చంపేస్తున్న సోషల్ మీడియా

ప్రస్తుత సినిమా నిర్మాణ శైలిపైనా రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కారణంగా సినిమాలకు సంబంధించిన మిస్టరీ పూర్తిగా కనుమరుగైపోతోందన్నారు. "సినిమా విడుదల కాకముందే లీకులు వచ్చేస్తున్నాయి. పబ్లిసిటీ పేరుతో ప్రతి చిన్న విషయాన్ని బయటపెట్టడం వల్ల సినిమాపై ప్రేక్షకుడికి ఉండాల్సిన ఆసక్తి చచ్చిపోతోంది. ఒకప్పుడు షూటింగ్ స్పాట్‌లో నటులను చూడటమే గగనంగా ఉండేది, కానీ ఇప్పుడు అంతా బహిరంగంగా మారిపోయింది" అని ఆయన విమర్శించారు.

'రేజర్'లో అంతా నేచురల్

అయితే, తన తాజా చిత్రం 'రేజర్' విషయంలో పూర్తి భిన్నమైన పంథాను అనుసరించినట్లు రవిబాబు తెలిపారు. ఈ సినిమాలో ఏ ఒక్క సన్నివేశంలోనూ దూప్ ను వాడలేదని, ఫైట్ సీక్వెన్స్‌లను చాలా సహజంగా, వాస్తవికతకు దగ్గరగా చిత్రీకరించామని స్పష్టం చేశారు. తనీష్, బెనర్జీ కీలక పాత్రలలో నటించిన ఈ చిత్రాన్ని సురేశ్ బాబు సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మించారు. వినూత్న కథాంశంతో రాబోతున్న ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. రవిబాబు వ్యాఖ్యల నేపథ్యంలో 'రేజర్'లో ఆయన చెప్పిన సహజత్వం ఎలా ఉంటుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# అషు రెడ్డి కేసులో ఆడియో లీక్.. ధర్మేంద్రకు వార్నింగ్!

**పెళ్లి పేరుతో రూ.9 కోట్లు మోసం చేశారంటూ అషు రెడ్డిపై ఆరోపణలు**

**కేసులో కీలకమైన ఆడియో టేపులు ఆన్‌లైన్‌లో లీక్**

**బాధితుడు ధర్మేంద్రకు వార్నింగ్ ఇస్తున్నట్లుగా ఉన్న ఆడియో**

**కోటిన్నర తిరిగిస్తా.. మిగతాది తర్వాత చూస్తానంటూ ఆడియోలో సంభాషణ**

నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అషు రెడ్డిపై నమోదైన చీటింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితుడైన ఎన్నారై ధర్మేంద్రను అషు రెడ్డి హెచ్చరిస్తున్నట్లుగా చెబుతున్న ఓ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. ఇదే సమయంలో, తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ అషు రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లీకైన ఆడియో ప్రకారం.. ధర్మేంద్ర నుంచి తీసుకున్న డబ్బులో రూ.1.5 కోట్లను మే నెలలో తిరిగి ఇస్తానని, మిగిలిన మొత్తం తాను జీవితంలో స్థిరపడ్డాక చెల్లిస్తానని అషు రెడ్డి చెప్పినట్లుగా ఉంది. తన కుటుంబ సభ్యులను ఈ వివాదంలోకి లాగితే, వేధింపుల కింద ఎదురు కేసు పెడతానని హెచ్చరించినట్లు సమాచారం. నటి ప్రవీణ, జ్యోతిష్యుడు వేణు స్వామి మధ్యవర్తిత్వంలో ఈ విషయాన్ని పరిష్కరించుకుందామని కూడా ఆ ఆడియోలో ప్రస్తావించినట్లు వార్తలు వస్తున్నాయి.లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మేంద్ర అలియాస్ వెంకట్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషు రెడ్డి 2018 నుంచి సుమారు రూ.9.35 కోట్లు, 5 కిలోల బంగారం, లగ్జరీ కార్లు, ఫ్లాట్లు తీసుకున్నారని ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అషు రెడ్డి, ఆమె కుటుంబ సభ్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. తాజా పరిణామాలతో అషు రెడ్డి ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, ఈ ఆడియో టేపుల వాస్తవికతను పోలీసులు ఇంకా ధృవీకరించలేదు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.